

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (గురు)
సహరి : 4:49 (శుక్ర)

యుద్ధం.. సిద్ధం!



ఎంపీ స్థానాల్లో మతలబు


ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో పొత్తులో భాగంగా ఎవరికి కేటాయించిందీ స్పష్టత లేక తీవ్ర కసరత్తుకు దారితీసింది. ఈ రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని ఖచ్చితంగా బీజేపీ కోరుకుంటోంది. నరసాపురం స్థానాన్ని మాత్రమే మిగుల్చుకుని ఏలూరును వదిలేయాలని బుధవారం వరకు ఆ పార్టీలో చర్చ సాగింది. కానీ బుధవారం పరిణామాలు వేగంగా మారాయి. ఆరెస్సెస్ నుంచి ఒత్తిడి పెరగడం, ప్రజల్లో ఒకింత పట్టున్న నాయకుడు గారపాటి చౌదరిని వదులుకోవడం ఇష్టం లేక పార్టీ పునరాలోచనలో పడినట్టు సమా చారం. ఉమ్మడి పశ్చిమలో ఉన్న ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో ఒక స్థానాన్ని మాత్రమే పొత్తులో భాగంగా ఎంపిక చేసుకోవచ్చని తెలుగుదేశం, జనసేన ఇచ్చిన ఛాన్స్ వినియోగించుకోవడానికి బీజేపీ ముప్పుతిప్పలు పడుతోంది. ఒకానొక దశలో నరసాపురం బీజేపీకి, ఏలూరు టీడీపీకి అనే ప్రచారం, ఆ రీతిలోనే నేతల మధ్య చర్చ సాగింది. కానీ దీంతో ఏలూరులోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, ఆయన అనుచర వర్గం కొంత అసంతృప్తికి గురై ఈనెల 15న ఏలూరులో ఆత్మీయ సదస్సుకు ముహూర్తం పెట్టారు. గారపాటి చౌదరి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారంటూ ప్రచారం సాగినా దానికి విరుద్ధంగా బీజేపీ నుంచి అనుకూల సంకేతాలు వెలువడినట్టు చౌదరి వర్గీయులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరెస్సెస్ ముఖ్యులు జోక్యం చేసుకున్నట్టు, ఢిల్లీ స్థాయిలో ఏలూరులో జరుగుతున్న పరిణామాలను చేరవేసినట్టు సమాచారం. దీంతో గారపాటిని కాస్త ఓపిక పట్టాల్సిందిగా సంకేతాలు ఇచ్చారు. ఏలూరును బీజేపీ సమర్థించుకుంటే నరసాపురం టీడీపీ ఖాతాలో చేరబోతోంది. నరసాపురం నుంచి సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు బరిలో దిగేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. మంగళవారం వరకు రఘురామ ఏ పార్టీ తరపున పోటీ చేస్తారనే విషయంలో ఎవరిష్టం వచ్చినట్లుగా వారంతా రకరకాల అంచనాలు వేశారు. ఈ వ్యవహారం అంతా గురువారం నాటికి పూర్తి స్పష్టత రానుంది. మరోవైపు టీడీపీ పక్షాన ఎంపీ స్థానానికి గోరుముచ్చు గోపాల్ యాదవ్, కంభంపాటి రామ్మోహన్ పేర్లతో పాటు కొత్తగా ఉన్నత పోలీసు అధికారి సత్యనారాయణ గౌడ్ పేరు బుధవారంనాడంతా తెలుగు దేశం వర్గాల్లో చక్కర్లు కొట్టాయి.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేందుకు కొద్దిరోజులే మిగిలి వుండగా, ఈలోపే అభ్యర్థుల జాబితా విడుదలకు ప్రధాన పక్షాలన్నీ సంసిద్ధం. మూడు పార్టీల కూటమి ఇప్పటికే మూడొంతులు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేయగా, మిగిలిన స్థానాల జాబితాను నేడో, రేపో ప్రకటించనున్నారు. అధికార వైసీపీ ఉమ్మడి జిల్లాలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు ఈనెల 16న గంపగుత్తగా ప్రకటిం చనుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల కూటమి సీట్ల విషయంలో తేల్చుకోవాల్సి ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థుల కొందరి పేర్లను శనివారంలోపు విడుదల చేస్తారు.


- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

జనసేన దూకుడు


ఎన్నికల యుద్ధంలో దూకేందుకు వీలుగా జనసేన తన సైన్యాన్ని సిద్ధం చేసింది. ఉమ్మడి పొత్తులో భాగంగా తమ పార్టీకి కేటాయించిన స్థానాల్లో తన అభ్యర్థులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆరంభించింది. తాడేపల్లిగూడెం నుంచి అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, భీమవరం నుంచి పులపర్తి ఆంజిబాబు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్‌లను అధికారికంగా ధ్రువీకరించి వారందరికీ ఉమ్మడి పోటీ పత్రాలను బుధవారం చేతికందించింది. ఉమ్మడి పశ్చిమలో ఆరు స్థానాలు జనసేన కోటాలో రాగా, ఒక్క పోలవరం మినహా మిగతా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది. భీమవరం నుంచి అంద రూ ఊహించినట్లుగానే పార్టీ అధ్యక్షుడు పవన్ తప్పుకుని తన స్థానంలో మాజీ ఎమ్మెల్యే అంజిబాబుకు అవకాశం ఇచ్చారు. పోలవరం నుంచి తగిన అభ్యర్థిని మిగతా వారితో సమానంగా గురు, శుక్రవారాల్లో ప్రకటించబోతున్నారు.




అంజిబాబు



బొలిశెట్టి



ధర్మరాజు



నాయకర్

బీజేపీలో కసరత్తు

భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల ఎంపికలో జాబితా విడుదలలో ఇంకా జాప్యం చేస్తూనే ఉంది. ఉమ్మడి పశ్చిమలో ఒక పార్లమెంట్, ఒకటి లేదా రెండు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ పోటీ చేయగలదని అందరూ భావించారు. అయితే దీనికి విరుద్ధంగా ఏలూరు జిల్లాలో భాగమైన కైకలూరు నుంచి మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను రంగంలోకి దించబోతున్నారు. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో ఒక స్థానం నుంచే బీజేపీ తన అభ్యర్థిని రంగంలో దించబోతోంది. ఇప్పటికే జనసేన తన అభ్యర్థులను ప్రకటించినందున ఇప్పటివరకు సాగిన ఊహాగానాలన్నీ తేలిపోయాయి.

తుది జాబితాల్లో ప్రధాన పక్షాలు

- ఎంపీ స్థానాల్లో ఆకస్మిక పరిణామాలు
- నలుగురు అభ్యర్థులకు జనసేన గ్రీన్‌సిగ్నల్
- తేల్చాల్సింది పోలవరమే..
- కైకలూరు నుంచి బీజేపీ
- ఈ నెల 16న అధికార వైసీపీ జాబితా
- సీఎం జగన్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- దెందులూరులో తేల్చబోతున్న టీడీపీ
- కాంగ్రెస్, కమ్యూనిస్టుల సుదీర్ఘ కసరత్తు

జాబితాతో వైసీపీ సిద్ధం

ఇప్పటికే కొన్ని మార్పులు చేర్పులతో జాబితాను సవరించిన అధికార వైసీపీ ఈ నెల 16న తుది జాబితా విడుదలకు సిద్ధం అవుతోంది. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితా విడుదల చేయడం ద్వారా తనదైన మార్క్ ప్రదర్శించా లని ఆ పార్టీ తహతహలాడు తోంది. ఈలోపు మంగళవారం తాడేపల్లిలో గోదావరి జిల్లాల నియోజకవర్గ కన్వీనర్లు, మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలతో సీఎం జగన్ ముఖాముఖి భేటీ అయ్యారు. ఆలస్యంగా ఈ సమాచారం బయటకు వచ్చింది. ఉమ్మడి పశ్చిమ నుంచి 15 మంది సీఎంతో భేటీకి హాజరయ్యారు. 'మీరంతా రంగంలో దిగండి.. ఎక్కడా వెనుకబడొద్దు.. ప్రజల్లోకి వెళ్లండి, ప్రతి అవకాశాన్ని వినియోగించుకోండి..' అని సీఎం హితవు పలికారు. అంటే ఇక ఎలాంటి మార్పులు చేర్పులు ఉండవని ఈ సమావేశానికి వచ్చినవారంతా అభ్యర్థులే అన్నట్లుగా స్పష్టత ఇచ్చారు. ఏలూరు నుంచి ఆళ్ళ నాని, ఉంగుటూరు నుంచి పుప్పాల వాసుబాబు, చింతలపూడి నుంచి విజయరాజు, పోలవరం నుంచి రాజ్యలక్ష్మి, కొవ్వూరు నుంచి తలారి వెంకట్రావు, గోపాలపురం నుంచి మంత్రి తానేటి వనిత, నిడదవోలు నుంచి శ్రీనివాసులు నాయుడు, తణుకు నుంచి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం నుంచి మంత్రి కొట్టు సత్యనారాయణ, నరసాపురం నుంచి ప్రసాదరాజు, భీమవరం నుంచి గ్రంధి శ్రీనివాస్ పేర్లను అధికారికంగా ఈనెల 16న ప్రకటించనున్నారు. పాలకొల్లు కన్వీనర్‌గా వున్న గుడాల గోపి, ఉండి సమన్వయకర్తగా వున్న పీవీఎల్ నరసింహరాజుకు సైతం దాదాపు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఉండి నుంచి పీవీఎల్‌కు బదులుగా వేరొకరు వచ్చే ఛాన్స్ వుందని ఇప్పటివరకు పుకార్లు షికారు చేయగా, అది కాస్తా దాదాపు వీగిపోయింది. మిగతా జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి పశ్చిమలో కేవలం రిజర్వుడు నియోజకవర్గాల మీదే జగన్ కసరత్తు సాగింది. చింతలపూడిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు అమలాపురం ఎంపీ స్థానం ఆశపెట్టి చివరకు అది లేకుండా చేయడమే కాకుండా ఆయనకు ఇప్పటికీ చుక్కలు చూపిస్తూనే ఉన్నారు. హోంమంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. అక్కడున్న సిట్టింగ్ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు పంపారు.

టీడీపీలో తేల్చాల్సింది కొన్నే..

టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడి కూటమిలో భాగంగా టీడీపీ ఇంకా దెందులూరులోనే అభ్యర్థిని తేల్చాల్సి ఉంది ఈ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఛాన్స్ ఇస్తారని ఇప్పటికే అయన వర్గం ధీమాతో ఉంది. చింతమనేని సతీమణికి ఇస్తారని కొందరు విస్తృత ప్రచారం చేశారు. చింతమనేని దీన్ని తిప్పికొడుతూ తానే తిరిగి పోటీ చేయబోతున్నట్టు చాన్నాళ్ళ క్రితం బహిరంగంగా ప్రకటిం చారు. తెలుగుదేశం నాయకత్వం మాత్రం ఈ విషయంలో ఎలాంటి లీకేజీ లేకుండా ఇప్పటివరకు జాగ్రత్తపడుతూ వచ్చింది. తుది జాబితాలో చింతమనేని ఖచ్చితంగా ఉంటారనే దానిపై సాగుతున్న చర్చలు ఒక కొలిక్కి రాబోతున్నాయి. కాగా చింతమనేని పేరు జాబితాలో ఉన్నట్టు వార్తలు రావడంతో బుధవారం రాత్రి దుగ్గిరాలలోని చింతమనేని ఇంటికి పార్టీ శ్రేణులు భారీగా చేరుకుని బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు తినిపించుకున్నారు.

కాంగ్రెస్, కమ్యూనిస్టుల రూటెటు?

ఎన్నికల పొత్తులో భాగంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల తుది కసరత్తు సాగలేదు. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల విషయంపై ఏపీసీసీ బుధవారం సుదీర్ఘ కసరత్తు చేసింది. ఆయా నియోజకవర్గాల నుంచి ఆశావహుల నుంచి అందిన దరఖాస్తులను పీసీసీ ఇప్పటికే వడబోసి జాబితాను సిద్ధం చేసి ఏఐసీసీ ఆమోదానికి పంపినట్టు సమాచారం. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనున్నారు. కమ్యూనిస్టులు తాము పోటీ చేసే స్థానాల జాబితాను కాంగ్రెస్‌కు అందించాయి. దీనిపై ఇరుపార్టీల మధ్య తుది మంతనాలు సాగాల్సి వుంది.

నూరుశాతం పన్ను వసూలయ్యేనా?



- ఇప్పటి వరకు 60 శాతం ఆస్తి పన్ను వసూళ్లు
- మిగిలింది ఇంకా 15 రోజులే..

ఏలూరు టూటౌన్, మార్చి 13: నగర పాలక సంస్థ ఆస్తిపన్ను 2023- 24 ఆర్థిక సంవత్సరానికి 60 శాతం వసూలైంది. మిగిలింది ఇంకా 15 రోజులే. ఈ సమయంలో నూరుశాతం పన్నులు వసూలు అవుతాయా లేదా అనేది సందేహమే. ఈ ఏడాది ఆస్తి, నీటిపన్ను, ఖాళీ స్థలాల పన్నులు, ఆశీలు, షాపు రెంట్లు, పార్కులు, ప్లేగ్రౌండ్ల నుంచి రూ.39.4 కోట్ల వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.23.47 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.15.57 కోట్లు వసూలు కావాల్సి ఉంది. పాత బకాయిలు రూ.37.86 కోట్లు వసూలు కావాల్సి ఉండగా వాటిలో రూ.8.82 కోట్లు వసూలైయ్యాయి. ఇంకా రూ.29 కోట్లు వసూలు కావాల్సి ఉంది. నగరంలో 68,183 మంది పన్ను చెలింపుదారులు ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.10.17 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.6.67 కోట్లు వసూలైయ్యాయి. ఇంకా రూ.3.5 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

నూరుశాతం వసూలు చేస్తాం..



ఆస్తి పన్ను వసూళ్ల వేగం పెంచాం. ఈ నెలాఖరు నాటికి నూరుశాతం వసూళ్ల సాధిస్తాం. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సచివాలయ సిబ్బంది, నగర పాలక సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. నగరపాలక సంస్థలో పన్ను చెల్లించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం.

- డాక్టర్ ఎన్.రాధ, డిప్యూటీ కమిషనర్

పీఎం విశ్వకర్మ పథకంపై మండల స్థాయి కమిటీలు : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 13 : సంప్రదాయ కులవృత్తి దారులు, హస్త కళాకారులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానిమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై మండల స్థాయి కమిటీలను నియమిం చాలని ప్రధానమంత్రి విశ్వకర్మ జిల్లా ఇంప్లిమెంటేషన్ కమి టీని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం బుధవారం జరి గింది. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కమిటీలో ఎంపీడీవో, ఏపీఎం, ఏఎస్‌డబ్ల్యూ, ఏ.టి డబ్ల్యూవో (ట్రైబల్) సభ్యులుగా ఉంచాలని, బ్యాంకు నోడల్ పర్సన్‌గా యూనియన్ బ్యాంకు, స్టేట్‌బ్యాంకు ను నియమించాలన్నారు. పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజరు ఆదిశేష మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఇప్పటివరకు 70,717 దరఖాస్తులు అందాయన్నారు. కమిటీ సభ్యులు, జడ్పీ సీఈవో సుబ్బారావు, కమిషనర్ వెంకటకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, డీపీవో టి.శ్రీనివాస విశ్వనాథ్, ఎల్‌డీఎం నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్



ఆలయ హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

16 రోజులు.. రూ.1.25 కోట్లు

- చిన వెంకన్న హుండీల ఆదాయం

ద్వారకాతిరుమల, మార్చి 13 : ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామికి గడచిన 16 రోజులకు గాను హుండీల ద్వారా రూ.1.25 కోట్లు భారీ ఆదాయం సమకూరింది. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో బుధవారం కట్టు దిట్ట భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన రూ.1,25, 42,973 నగదు, 97 గ్రాముల బంగారం, 2.695 కేజీల వెండి, రద్దయిన పాతనోట్లు రూ.500 (7), 1000 (1), 2000 (20)తో పాటు విదేశీ కరెన్సీ వచ్చినట్టు ఈవో త్రినాథరావు తెలిపారు.

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

ఏలూరు కలెక్టరేట్, మార్చి 13 : కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగించుకోవాలని జేసీ బి.లావణ్యవేణి సూచిం చారు. పీఎం సూరజ్ జాతీయ పోర్టల్‌ను బుధవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభిం చారు. కలెక్టరేట్ నుంచి జేసీ, అధికారులు లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థికాభివృద్ధికి లక్ష రూపాయలు రుణ సదుపాయా నికి దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. సఫాయికర్మ చార్యు లకు పీపీఈ కిట్లు, మహిళలకు శ్రీనిధిపథకం రుణాలు అందజేశారు. న్యూఢిల్లీకి చెందిన జాతీయ షెడ్యూల్ కులాల ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ జీఎం కె.డేవిడ్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, కమిషనర్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

అంతా రెడీ..

- త్వరలో ఎన్నికల షెడ్యూల్
- 11,250 మంది పోలింగ్ సిబ్బందికి, అధికారులకు శిక్షణ
- జిల్లాలో పోలింగ్ కేంద్రాలు 1,743
- మొత్తం ఓటర్లు 16,24,416
- మహిళా ఓటర్లే అధికం

ఏలూరు సిటీ, మార్చి 13 : సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది. ఈసారి ఎన్ని కలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అను గుణంగా సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది నియామకాలను పూర్తి చేసి వారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులు గా ఎన్నికల నిర్వహణపై జిల్లా కసరత్తు నిర్వహిస్తోం ది. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 16,24,416 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 8,30,390 మంది మహిళా ఓటర్లు ఉండగా, 7,93,897 మంది పురుష ఓటర్లు ఉన్నారు. 129 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో 1,743 పోలింగ్ కేంద్రాలు

రానున్న ఎన్నికలకు జిల్లాలో 1,743 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిని అధికారులు ఇప్పటికే పరిశీలిం చారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల గురించి వారు పరిశీలించారు. జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఏలూరులోని సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వాటి ఏర్పాటు గురించి అధికారులు పరిశీలించారు.

రాజకీయ పక్షాలతో సమావేశాలు

సార్వత్రిక ఎన్నికలకు త్వరలో షెడ్యూలు విడుదల కానుండడంతో జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహించి ఎన్నికల ప్రక్రియ , ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి దిశా నిర్దేశం చేస్తున్నారు.

ఓటర్లలో అవగాహనకు స్వీప్

రానున్న ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచడానికి గాను జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ఓట ర్లలో చైతన్యం కలిగిస్తున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 191 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో, 7 మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న భవిష్యత్ ఓటర్లతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే 11,250 మందిని ఎన్నికల సిబ్బందిగా ఎంపిక చేసి వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రవ ర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేయాలని ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు పాత్ర కీలకమని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఫలితాలు ప్రక టించే వరకు ఆర్వోలు, ఏఆర్వోలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచిచారు. ఎన్నికల ప్రవ ర్తనా నియమావళి, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, పోటీ లో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్య తలు రిటర్నింగ్ అధికారులపై ఉంటాయి.



కైకలూరులో బుధవారం ఈవీఎంల పనితీరును పోలింగ్ అధికారులకు వివరిస్తున్న కలిదిండి తహసీల్దార్ వంశీ

ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజల అవగాహన కోసం ఏర్పాటు చేసిన మోడల్ ఈవీఎం, వీవీప్యాట్‌లను బుధవారం అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈవీఎం వినియోగంపై గ్రామీణ , గిరిజన ప్రాంతాల్లోని వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన డీఆర్వో పుష్పమణి, కలెక్టరేట్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

3,716 దరఖాస్తుల పరిష్కారం

జిల్లాలో వారం రోజులుగా ఓటరు చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబం ధించి 3,716 దర ఖాస్తులను పరిష్కరించామని, మరో 2,809 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖే ష్ కుమార్ మీనాకు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఎన్నికల అధికారులు చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను బుధవారం సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ మేరీప్రశాంతి , జేసీ లావణ్యవేణి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫారం- 6,7,8 కు సంబంధించి 29,481 దరఖాస్తులు అందగా 26,672 ప్రాసెస్ చేయగా మరో 2,809 దరఖాస్తులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. ఎపిక్ కార్డులకు సంబంధించి 1,54,393 ప్రింటర్ వద్ద నుంచి ఈ రోజు సాయంత్రం బట్వాడా అవుతున్నట్టు వివరించారు. 16,595 కార్డులకు డేటాను తీసుకుని వాటి ముద్రణకు ప్రింటర్‌కు బుధ వారం పంపించినట్టు వివరించారు. ఓటర్ల జాబితాపై పత్రికలలో 37 వార్తాంశాలు ప్రచురితం కాగా వాటిపై చర్యలు తీసుకున్నామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 541 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 13 : జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం భౌతికశాస్త్రం/అర్థశాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 12,257 మంది, ఒకేషనల్ విభాగంలో 1,743 మంది విద్యార్థులు హాజరు కాగా 541 మంది గైర్హాజరైనట్టు వివరించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

చెత్తకుండీలో నవజాత శిశువు

- తాడేపల్లిగూడెంలో అమానుష ఘటన

7

ఉద్యోగం ఆశ చూపి మోసం

రక్షణ ఇదేనా ?

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో యథేచ్ఛగా శునకాలు, పందులు

- జంతువులు రాకుండా ఉండేందుకు రూ. మూడు లక్షలు కాంట్రాక్టు
- నెలనెలా బిల్లుల చెల్లింపు.. కానరాని ఆ విభాగం ఉద్యోగులు
- చెదలు పడుతున్నా.. పట్టించుకోని సంబంధిత కాంట్రాక్టర్లు

ఏలూరు క్రైం, మార్చి 13 : ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాదు. వారికి దోమలు, చీమల నుంచి కూడా రక్షణ కల్పించాలని టీడీపీ ప్రభుత్వం అప్పట్లో చర్యలు తీసుకుంది. అంతేకాకుండా మార్చురీలో ఉన్న మృత దేహాలను ఎలుకలు, పంది కొక్కులు, కుక్కలు పీక్కుతింటున్నాయని అక్కడ కూడా రక్షణ కల్పించాలని నిర్ణయించి ఏకంగా నెలకు లక్షలాది రూపాయలను వెచ్చిస్తుంది. జిల్లా కేంద్రమైన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఒక మృతదేహం నేత్రాలను ఎలుకలు పీక్కుతినేయడం, గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చీమలు ఒక పసిబిడ్డ మృతదేహాన్ని తినేయడం జరిగిన ఘటనలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వాసుపత్రిలో కుక్కలు, పందులు, ఎలుకలు, చీమలు, బొద్దింకలు, బల్లులు, దోమలు, ఈగలు లేకుండా చేయడానికి నెలకు లక్షలాది రూపాయలను థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్‌కు అన్ని ఆసుపత్రులలో పనులను అప్పగించి చెల్లిస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఈ కాంట్రాక్టరు సొమ్ములు తీసుకోవడం తప్పితే ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వా సుపత్రి ఆవరణ నిండా శునకాలు, పందులు తిరుగుతూనే ఉన్నాయి. వాటి సంతానాన్ని ఆసుపత్రి ఆవరణలో అభివృద్ధి చేసుకుని ఆవాసాలుగా మార్చుకున్నాయి. ఇక దోమలు, ఈగలు చెప్పనక్కరలేదు. వీటన్నింటిని నిర్మూలించడానికి రసాయనాలను పిచికారీ చేయాల్సి ఉంటుంది, కానీ ఎక్కడా ఇలాంటివి జరిగిన దాఖలాలు కనిపించడంలేదు. నెలవారీ చూస్తే మూడు లక్షల రూపాయల పైబడి బిల్లులు అధికారులు చెల్లించడం గమనార్హం.

వార్డుల్లోనూ తిరుగుతున్న కుక్కలు

ఆసుపత్రి ఆవరణలోనే కాకుండా వార్డుల్లో కూడా కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతూ తమ ఆవాసాలుగా మార్చేసుకుంటున్నాయి. ఆసుపత్రికి రోగాలు పోగొట్టుకోవడానికి వచ్చే రోగులకు వీటి వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుక్కలు ఆసుపత్రిలో తిరుగుతుండడంతో ఆసుపత్రికి వచ్చే వారు భయభ్రాంతులకు గురవుతున్నాయి. తల్లీబిడ్డల వైద్యసేవల విభాగం వద్ద కుక్కలు ఎక్కువగా తిరగడం వల్ల వచ్చే బాలింతలు, గర్భిణులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మార్చురీ వద్ద పరిస్థితి దుర్భరంగా ఉంది.

చీకటిపడితే దోమల విజృంభణ

చీకటి పడిందంటే రోగులు దోమల నిర్మూలనకు అగరబత్తీలను, పలు రకాల క్వాయిల్స్‌ను, మస్కిటో బ్యాట్‌లను వినియోగించాల్సి వస్తుంది. ఒక్క రోజు కూడా దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేసినట్టు లేనేలేదు. చెదలు లేకుండా రసాయనాలు పిచికారీ చేయాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో తలుపులు, గుమ్మాలను కూడా తినేస్తూనే ఉన్నాయి. అయితే ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమైన పరిస్థితి. అసలు ఆ విభాగానికి సంబంధించిన ఉద్యోగులు ఎవరు, ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి. కానీ అధికారులు మాత్రం నెలావారీ బిల్లులు చెల్లించడం వెనుక అంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చే పలువురు కోరుతున్నారు.



చెదలు పట్టిన తలుపు



ఆసుపత్రి లోపల ఉన్న శునకం



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వున్న పందులు



ఎంసీహెచ్ బ్లాక్ వద్ద తిరుగుతున్న శునకాలు

మరో 62 మంది వైద్య ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఉత్తర్వుల జారీ

- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇప్పటివరకు 247మందికి రెగ్యులరైజేషన్.. మరో 23 మందికి పెండింగ్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 13 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో తాజాగా మరో 62 మంది పలు కేడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాలో ఇటీవలే 185 మంది ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. తాజాగా విడుదలైన జీవోలు 40, 41లలో జిల్లాకు సంబంధించి ఎంపీహెచ్ఏ(మేల్) 34మంది, ల్యాబ్ టెక్నీషియన్లు 11మంది, ఫార్మాసిస్టులు నలుగురు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు ఇద్దరు, ఏఎన్ఎం/ఎంపీహెచ్ఏ(ఫీమేల్) 11మంది సర్వీసుల క్రమబద్ధీకరణకు అనుమతి లభించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం అన్నికేడర్లు కలిపి మొత్తం 270 మంది ఉద్యోగులతోకూడిన జాబితాను ప్రభుత్వానికి పంపించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్‌లో ఈ జాబితాలను పరిశీలించి విడతల వారీగా క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీచేస్తున్నారు. తాజా ఉత్తర్వులతో ఇప్పటివరకు రెండు విడతల్లో మొత్తం 247 మందికి క్రమబద్ధీకరణ లభించినట్టయింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఇంకా రెగ్యులరైజేషన్ ప్రతిపాదనల్లో మిగిలివున్న ఎంపీహెచ్ఏ(మేల్)14మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఇద్దరు, ఫార్మసిస్టు ఒకరు, ఏఎన్ఎంలు ఆరుగురు కలిపి మొత్తం 23మందికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు శుక్రవారం నాటికి జారీ అయ్యే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు తెలిపాయి. బుధవారం ఉత్తర్వులు జారీఅయిన ఉద్యోగులకు గురువారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం రెగ్యులరైజేషన్ ఆర్డర్లను అందజేయనున్నారు.

నానో టెక్నాలజీపై ఒకరోజు జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ పద్మారావు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: నానో టెక్నాలజీ ఇన్స్ట్రుమెంటేషన్ ఉత్తేజపరిచే విధానం రోజు రోజుకు సాంకేతిక విధానంతో మరింత నైపుణ్యత, మెలకువలు పెరుగుతున్నాయని ఏపీ ట్రిపుల్ ఐటీ మాజీ డైరెక్టర్ జి. భగవన్నారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో బుధవారం ఆచార్య నన్నయ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నానో టెక్నాలజీపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ కె.పద్మారావు మాట్లాడుతూ సంక్లిష్ట మైన సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో ఆవిష్కరణలను నడపడంలో ఇంటర్ డిసిప్లనరీ పరిశోధన ప్రాముఖ్యతలను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా భారత్



కార్యక్రమంలో విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న డాక్టర్ నాగసీతారాం

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 13 : సెమీ కండక్టర్ల తయారీ విభాగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తుందని హైదరాబాద్ బిట్ సిలికా మేనేజర్ డాక్టర్ ఎం.నాగసీతారాం అన్నారు. ఏపీ నిట్‌లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 'సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉన్న అవకాశాలు, సవాళ్ళు' అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులే కీలకమన్నారు. సెమీ కండక్టర్ల ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు భారతదేశంలో తగినన్ని లేకపోవడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. దేశంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని, భవిష్యత్‌లో భారత్ సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత ప్రధాని మోదీ గుజరాత్, అస్సాం రాష్ట్రాలలో ప్రారంభించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్ కార్యకమాన్ని వర్చువల్ పద్ధతిలో తిలకించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు జీఆర్ కె.శాస్త్రి, టి.కురుమయ్య, ఎన్.జయరాం, జీబీ.వీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, శ్రీఫణికృష్ణ, యువరాజు, కిరణ్‌కుమార్, హిమబిందు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్లలో పోలీస్ తనిఖీలు



మసాజ్ సెంటరును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 13 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని ఏలూరు, నూజివీడు నగరాల్లో ఆకస్మికంగా మసాజ్ సెంటర్లపై పోలీసు అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేశారు. విజయవాడలో ఈనెల 12వ తేదీన ఆకస్మికంగా మసాజ్ సెంటర్లపై పోలీసులు తనిఖీలు చేయగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మసాజ్ పేరుతో క్రాస్ మసాజ్‌లు చేయడం, వ్యభిచారం నిర్వహించడం వంటి విషయాలు వెలుగులోకి రావడంతో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నూజివీడు, ఏలూరు నగరాల్లో ఉన్న మసాజ్ సెంట ర్లపై బుధవారం సాయంత్రం తనిఖీలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదని ఎక్కడైనా మసాజ్ సెంటర్లలో జరుగుతున్నట్టు సమాచారాన్ని 100, 112 లేదా పోలీస్ కంట్రోల్ నంబర్ 83329 59175కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఏలూరు నగరంలో జరిగిన దాడుల్లో త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు, టూటౌన్ సీఐ ప్రభాకర్ పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థినుల అదృశ్యం

ఆగిరిపల్లి, మార్చి 13: ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు బుధవారం పాఠశాలకు వెళ్లి కనబడకుండా పోయారు. స్కూల్ విడిచిన తరువాత ఇళ్లకు రాలేదని వారి తల్లిదండ్రులు ఆగిరిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8.30 నిమిషాలకు స్కూల్‌కి వెళ్లిన పిల్లలు తిరిగి రాకపోడంతో స్కూల్‌లో వాకబ్ చేస్తే పిల్లలు పాఠశాలకు రాలేదని తెలిసిందన్నారు. దీనిపై ఎస్ఐ సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96444 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

భీమవరంలో ఇరువర్గాల ఘర్షణ !

- ఓ కేసుకు సంబంధించి పెంటపాడు పోలీసులు వచ్చారని సీఐ స్పష్టం

భీమవరం క్రైం, మార్చి 13 : భీమవరం పాతబస్టాండ్‌లో ఇరువర్గాల ఘర్షణతో ఆ ప్రాంతం హడలెత్తింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన కిడ్నాపా, ఇరువర్గాల ఘర్షణో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేసరికి ఎటువంటి ఘర్షణ వాతావరణం లేదని.. ఓ కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం కొంతమందిని తీసుకెళ్లేందుకు పెంటపాడు పోలీసులు వచ్చారని సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. నీళ్ల తోడే మోటార్లను కొందరు దొంగిలించారని, వాళ్లల్లో కొందరిని పెంటపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరికి విక్రయించారో, ఆ మోటార్లు ఎక్కడ ఉన్నాయో విచారణలో భాగంగా భీమవరం వచ్చారు. ఆరు నెలల క్రితం కొనుగోలు చేసినట్టు చెబుతున్న వ్యక్తిని కారులోకి ఎక్కించుకుని వెళ్లారు. ఈ నేపథ్యంలో మీరెవరో తెలియకుండా ఏవిధంగా పెంటపాడు స్టేషన్‌కు వస్తామని సదరు వ్యక్తితో పాటు మరికొందరు పోలీసులను ప్రశ్నించగా కారులో వచ్చినవాళ్ళు పోలీసులమన్నారు. గుర్తింపు కార్డులు చూపాలని పోలీసులను ప్రశ్నించడంతో పోలీసులనే గుర్తింపు కార్డులు అడుగుతారా అంటూ అక్కడున్న వారిని కారులోకి ఎక్కించుకుని వెళ్లారు. అపహరణకు గురైన మోటార్ల విలువ రూ.10లక్షలు ఉంటుందని దీని నిమిత్తం విచారణ నేపథ్యంలో వివాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

పట్టుబడిన లిక్కర్ ధ్వంసం



నూజివీడు టౌన్, మార్చి 13: నూజివీడు సెబ్ స్టేషన్‌ను ఏలూరు సెబ్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ బుధవారం సందర్శించారు. సిబ్బందితో నేరాలను తగ్గించే విధానాలపై చర్చించారు. అనంతరం గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు వివిధ కేసుల్లో పట్టుబడిన 383 లీటర్ల సారా, 581 మద్యం సీసాలను ఆయన ధ్వంసం చేశారు. నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వృద్ధురాలిపై ఏసీ మెకానిక్ దాడి..

- 14 కాసుల బంగారంతో ఉడాయింపు.. పరిమెళ్లలో ఘటన



గాయపడిన వృద్ధురాలు

పెంటపాడు, మార్చి 13 : ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న 14 కాసుల బంగారాన్ని అపహరించుకుపోయిన ఘటన బుధవారం పరిమెళ్ళ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో పెనుమత్స వెంకట సూర్యాకాంతం(80) అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమెకు పిల్లలు లేరు. భర్త కూడా మృతి చెందడంతో ఒంటరిగానే జీవిస్తుంది. ఆదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఒంటరిగా జీవిస్తున్న ఆమె బంగారంపై అతడి కన్నుపడింది. రెండు రోజులుగా ఆమె ఇంటి వద్దే రెక్కీ నిర్వహించాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వీధిలో ఎవరూ లేకపోవడం చూసి వృద్ధురాలి గృహంలో ప్రవేశించాడు. ఆమె ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించడంతో ఏసీ ఎలా పనిచేస్తుందో తెలుసుకునేందుకు వచ్చానని నమ్మబలికి వృద్ధురాలిపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టాడు. వృద్ధురాలు స్పృహ తప్పడంతో ఆమె ఒంటిపై ఉన్న సుమారు 14 కాసుల బంగారం పట్టుకుని ఉడాయించాడు. అనంతరం విషయం తెలుసుకున్న చుట్టుపక్కల స్థానికు ఆమె ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం బాధితురాలు తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

విద్యుదాఘాతంతో మోటారు మెకానిక్ మృతి

పెదవేగి, మార్చి 13 : పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన దేవరపల్లి ఆంజనేయులు (40) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. దేవరపల్లి ఆంజనేయులు మోటారు మెకానిక్ పనులు చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి దగ్గర విద్యుత్ మోటారు పనులు చేస్తుండగా మోటారుకు విద్యుత్ ప్రవహించడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఏలూరు తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందిందని, వివరాలు తెలియాల్సి ఉందని పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు కూలీలకు గాయాలు



ముసునూరులో పల్టీ కొట్టిన ట్రాక్టర్

ముసునూరు, మార్చి 13: పొగాకు దుత్తల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ ముసునూరు మసీదు సమీపంలో ఉన్న మలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. చాట్రాయి మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ బుధవారం ఉదయం దెందులూరు మండలం కొప్పాకలో పొగాకు దుత్తలు లోడ్ చేసుకుని తిరిగి మర్లపాలెం వెళుతోంది. ఈ క్రమంలో ముసునూరు మసీదు పక్కన మలుపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్ ఇంజన్‌పై ఉన్న ఆరుగురు కూలీల్లో ఇద్దరు గాయపడగా వారికి ముసునూరు పీహెచ్‌సీలో చికిత్స అందించారు.

ఐదుగురు బైక్ దొంగల అరెస్ట్

- రూ.30 లక్షల విలువైన 25 మోటారు సైకిళ్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఉంగుటూరు, మార్చి 13 : వ్యసనాలకు బానిసలైన యువకులు కొత్త మోటారు సైకిళ్లను దొంగతనం చేసి దాచిన నేరంపై చేబ్రోలు పోలీసులు ఐదుగురు యువకులను అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30లక్షల విలువైన 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కైకరం గ్రామానికి చెందిన దొడ్డి లక్ష్మీనారాయణ, చిటికిన పవన్‌కుమార్, భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన చిట్టాబత్తుల కార్తీక్ , ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన వంతగాని లోకేష్, పింగ్రాల నాగులు... కైకరం నుంచి రెండు నంబర్లు లేని బైక్‌లపై వస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించి 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లోని వేర్వేరు పోలీసుస్టేషన్ల పరిధిలో నేరాలు చేసినట్టు వెల్లడించారు. ఈ మేరు నిడమర్రు సీఐ మోగంటి వెంకటసుభాష్, చేబ్రోలు, నిడమర్రు, గణపవరం ఎస్ఐలు ఎ.మణికుమార్, ఆర్.శ్రీను, వెంకటేశ్వరరావు, సిబ్బందిని అభినందించి నగదు బహుమతిని అందించారు.

చెత్తకుండీలో నవజాత శిశువు



చెత్తకుండీ వద్ద వున్న శిశువు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: తాడేపల్లిగూడెంలో అమానుష ఘటన వెలుగు చూసింది. అప్పుడే పుట్టిన ఆడబిడ్డ మృతదేహం చెత్తకుం డీలో బుధవారం ఉదయం దర్శనమిచ్చింది. పారిశుధ్య కార్మికులు చెత్త శుభ్రం చేసే క్రమంలో ఆ పసికందు మృతదేహం బయట పడింది. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ఉద్యోగం ఆశ చూపి మోసం

ముసునూరు, మార్చి 13: ఉద్యోగం ఆశ చూపి రెండు లక్షల రూపాయలు తీసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ముసునూరు గ్రామానికి చెందిన దాసిరెడ్డి బాలస్వాతి 2020-22 సంవత్సరంలో బైపీసీ గ్రూప్ తీసుకుని ఇంటర్ పూర్తిచేసింది. అయితే యువతి తండ్రి దాసిరెడ్డి నాగు సైకిల్, బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన గద్దల ఆశీర్వాదం అనే వ్యక్తి, యువతి తండ్రితో పరిచయం పెంచుకున్నాడు. నీట్ పరీక్ష రాయకుండా, పంజాబ్ జీఎస్ఏ యూనివర్సిటీలో బీఎస్సీ ఎనస్థీషియా (మత్తు మందు) కోర్సుకు సంబంధించిన సీటుతోపాటు విదేశాల్లో ఉద్యోగం కూడా ఇప్పిస్తానని యువతికి, ఆమె తండ్రికి ఆశీర్వాదం ఆశచూపి 2023 డిసెంబరు నెలలో రూ. 2లక్షల నగదును తీసుకున్నాడు. నాటి నుంచి మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నాడే తప్ప తీసుకున్న నగదు ఇవ్వకపోవడం లేదు. దీంతో యువతి బాలస్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



బేతపూడిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

భీమవరంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

- ఓటు హక్కుపై ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే : పోలీస్ అధికారులు

భీమవరం క్రైం, మార్చి 13 :ప్రశాంత వాతావరణంలో రాబోయే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకే కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ పట్టణంలో నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు భీమవరం అసెంబ్లీ నియోజకవర్గం, భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొత్తపూసలమర్రు, దొంగపిండి, తాడేరు, బేతపూడి, ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం, పోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అధైర్యపడకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ సంసిద్ధంగా ఉందన్నారు. ఈ మార్చ్‌లో భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ బి.రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్, ట్రిపుల్ ఎంట్రీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమవరం, మార్చి 13 : భీమవరం నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో ఓటు డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు నమోదైనందున వాటికి సంబంధించిన డేటాను జిల్లా కలెక్టర్‌కు అందజేసి వెంటనే ఆయా ఓట్లను తొలగించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు వినతి పత్రం అందించారు. ఇప్పటివరకు పరిశీలన చేయగా సుమారు 280 ఓట్లు డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, వానపల్లి సూరిబాబు, రామాయణం శ్రీనివాస్, జూలూరి వెంకటేష్ ఉన్నారు.

రేవు పాట రోజుకు రూ.1.05 లక్షల వసూలు !

- నెలాఖరుతో ముగుస్తున్న పాటదారుడి గడువు
- ఎన్నికల కోడ్ ముగిసిన తరువాతే రేవు పాటకు జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం



గోదావరిలో పంటు

నరసాపురం, మార్చి 13: మాధవాయిపాలెం రేవు పాట అనూహ్యంగా మలుపు తిరిగింది. షెడ్యూల్ ప్రకారం ఈనెలలో టెండర్ నోటీస్ జారీ చేసి పాటను నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తున్నందున పాటను కోడ్ ముగిసిన తరువాతే నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. ఎంపీపీ సోని ఆధ్యక్షతన జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసరంగా సమావేశమై ఈనిర్ణయం తీసుకుంది. అప్పటి వరకు ప్రస్తుత పాటదారుడినే కొనసాగించాలని, రోజుకు రూ.1.05లక్షల చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. దీన్ని జిల్లా అధికారులు ఆమోదించాల్సి ఉంది. ప్రస్తుతం పాటదారుడు నిర్వహణ ఈనెలాఖరుతో ముగుస్తుంది. గత ఏడాది పాటలో రూ.3.66 కోట్లకు పాటను దక్కించుకున్నాడు. ఇప్పటివరకు పాటదారుడు మొత్తం చెల్లిస్తూ వచ్చారు. ఇంకా రూ.20 లక్షలు కట్టాల్సి ఉంది. అతడి డిపాజిట్ రూ 21.72 లక్షలు ఉంది. ఉన్న బాకీ కూడా నెలాఖరు లోపు క్లియర్ చేస్తే అతడికి రేవు నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తామని ఎంపీడీవో రమణరావు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రోజువారీగా వసూలు చేస్తామన్నారు. కోడ్ ముగియగానే పాటను నిర్వహించే విధంగా ప్లాన్ చేశామన్నారు. దీనికి జిల్లా యంత్రాంగం నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు.

చల్ల..చల్లగా..

నోరూరిస్తున్న పుచ్చకాయలు

- కాయ సైజును బట్టి రూ.50-150 వరకు
- తమిళనాడు నుంచి దిగుమతి చేస్తున్న వ్యాపారులు
- ఆరోగ్యానికి మంచిదంటున్న వైద్యులు







పుచ్చకాయలు

గణపవరం, మార్చి 13: వేసవి ఎండలు పెరగడంతో పుచ్చకాయల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది మార్చి నెల మొదటివారంలోనే పుచ్చకాయలు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. చలితీవ్రత పూర్తిగా తగ్గి ఎండ తీవ్రత పెరడంతో ప్రజలు చల్లని పానీయాలకంటే పుచ్చకాయల వైపే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా పుచ్చకాయల్లో పోషకాలు, కాల్షియం, పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంట వచ్చేందుకు ఇంకా సమయం ఉండడంతో స్థానిక వ్యాపారులు తమిళనాడు రాష్ట్రం నుంచి పుచ్చకాయలు దిగుమతి చేసుకుంటున్నారు. టన్నుకు రూ.18వేలు, రవాణా ఖర్చులతో కలిపి సుమారు రూ.22 వేలకుపైగా అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కిలో రూ.40 - 45 వరకు, సైజును బట్టి ఒక కాయ రూ.50-150 వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు రహదారుల వెంబడి ఈ పుచ్చకాయల విక్రయాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గణపవరం బొబ్బిలి వంతెన వద్ద పుచ్చకాయల విక్రయాలు నిర్వహిస్తుండగా యువకులు తోపుడు బళ్ళ మీద, ఆటోలపైన గ్రామాల్లో విక్రయాలు చేస్తున్నారు. ఈ సీజన్ నాలుగు నెలల పాటు అనేక మందికి ఈ పుచ్చకాయల వ్యాపారం జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఎండలు పూర్తిగా ముదరకుండానే పుచ్చకాయల ధరలు ఇంత పలుకుతుంటే ఎండలు పెరిగాక ఏ స్థాయిలో ధరలు ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుష్కలంగా పోషకాలు



పుచ్చకాయల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. గ్లాసు రసంలో ఒక స్పూన్ తేనె కలిపి ప్రతీ రోజు తీసుకుంటే గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులు రాకుండా చూస్తుంది. మలబద్ధకం ఉన్నవారు కూడా ప్రతీ రోజు పుచ్చకాయ తింటే ఉపయోగం ఉంటుంది. జ్వరంతో ఉన్నవారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి సేవిస్తే నీరసం తగ్గి శక్తి పెరుగుతుంది. పుచ్చకాయలో పిండిపదార్థాంతో పాటు విటమిన్ ఏ, బీ1, బీ6, సీ, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పీచుపదార్థం వంటి పోషకాలు ఉంటాయి. రక్తప్రసరణ మెరుగుపడేలా, కిడ్నీలు పని చేసేలా చేస్తాయి. రక్తపోటు, జీవక్రియ చురుగ్గా సాగడానికి ఎంతో తోడ్పడుతుంది.

- కె.ప్రియాంక, ప్రభుత్వ వైద్యాధికారి, గణపవరం


మారేడుబాక సచివాలయం వద్ద టీడీపీ, జనసేన నాయకుల ఆందోళన

టీడీపీ ప్రజా ప్రతినిధి లేకుండా అభివృద్ధి పనులు

మారేడుబాకలో టీడీపీ, జనసేన ఆందోళన

కుక్కునూరు, మార్చి 13: మండలంలో మారేడుబాక గ్రామ సచివాలయ ప్రారంభోత్సవం వివాదం రేపింది. టీడీపీకి చెందిన ఎంపీటీసీ ముప్పాల శ్రీదేవిని ప్రొటోకాల్ ప్రకారం పిలిచారు. కార్యక్రమానికి ఆమె వస్తున్న క్రమంలోనే సచివాలయ భవనం ప్రారంభించారు. దీంతో తహసీల్దార్ అచ్యుతకుమారికి టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. కావాలని అవమానించేలా చేశారని టీడీపీ, జనసేన నాయకులు సచివాలయం వద్ద బుధవారం రాత్రి ఆందోళన చేశారు. కాగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం సచివాలయ భవనం ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. ఎన్నికల కోడ్ వస్తుందని హడావుడిగా ఓపెన్ చేశారని సమాచారం. మరోవైపు పలువురు అధికారులు ఒకసారి ఓపెన్ చేశామని.. మరొకసారి చేయలేదని రెండు సమాధానాలు చెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

శివారు భూములకు సాగునీరు అందించండి


వినతులు స్వీకరిస్తున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, మార్చి 13: పోగొండ జలాశయం ద్వారా శివారు భూములకు కూడా సాగునీటిని అందించాలని రైతులు కోరారు. కేఆర్.పురం ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బార్‌లో బుట్టాయగూడెం మండలం కంద్రికగూడెంకు చెందిన ఎల్లంపాటి సత్యనారాయణ మరికొందరు పీవో ఎం.సూర్యతేజకు వినతిపత్రం అందజేశారు. సాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, జలాశయం చెంతనే భూములున్నా సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నట్లు రైతులు తెలిపారు. తమ భూములకు కూడా నీరందేలా చూడాలని వినతిలో పేర్కొన్నారు. ఆరోగ్యం బాగాలేనందున ఇంటి నుంచి ప్రతిరోజు రాజానగరం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు వేళ్ళేందుకు అనుమతి ఇవ్వాలని పోలవరం మండలం కొండ్రుకోట పంచాయతీ వాడపల్లికి చెందిన సున్నం ప్రవల్లిక పీవోకు వినతిపత్రం అందజేసింది. దాచారంలో అగ్నిప్రమాదానికి గురైన కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని కోరుతూ మిడియం వెంకటస్వామి, ఐరకం ముత్తయ్య పీవోను కలసి బాధితుల వినతిపత్రాన్ని తరపున అందజేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి, నష్టపరిహారం, పరిహారాలు, మౌలిక సదుపాయాలు తదితర సమస్యలపై గిరిజనులు వినతిపత్రాలను అందజేసి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమస్యలపై పీవో సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్ఈబీ డీఎస్పీగా గణపతిబాబు


ఎస్పీని కలసిన ఎస్ఈబీ ఏఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 13: ఎస్ఈబీ డీఎస్పీగా ఎ.గణపతిబాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సారా, గంజాయి అక్రమ రవాణా జరుగకుండా నిరోధించాలని సూచించారు.

ఎన్‌జీవోలు సేవా దృక్పథంతో సేవలందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, మార్చి 13: ఎన్‌జీవోలు సేవా దృక్పథంతో మారుమూల ప్రాంత ప్రజలకు సేవలందించాలని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి న్యాయాధికారి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆదేశాల మేరకు న్యాయసేవా భవన్‌లో జిల్లాలోని వివిధ ఎన్‌జీవోల సంఘాల ప్రతినిధులతో రత్న ప్రసాద్ సమావేశం నిర్వహించారు. సేవా దృక్పథంతో పనిచేయడమే ఎన్‌జీవోల లక్ష్యమని, సామాజికంగా వెనుకబడిన ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యం, విద్య మొదలైన వాటిపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌జీవోలు ప్రజలకు, జిల్లా న్యాయసేవాధికార సంస్థకు వారధిగా పనిచేయాలని న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత సేవలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

13 మంది చిన్నారులకు రక్తమార్పిడి


రక్తమార్పిడి చేస్తున్న రెడ్‌క్రాస్ వైద్యులు

ఏలూరు క్రైం, మార్చి 13: రెడ్‌క్రాస్ భవనంలో 13 మంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు పీఏఆర్‌పి శ్రీనివాసరావు పిల్లలను పరీక్షించి మందులను అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ బీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు ప్రతి నెలా రక్తం ఎక్కించాల్సి ఉందని, దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ.సీతారామ్, కడియాల కృష్ణారెడ్డి, రెడ్డి, పీఆర్వో కేవీ.రమణ పాల్గొన్నారు.

రేపు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ఏలూరు కలెక్టరేట్, మార్చి 13: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జేసీ బి.లావణ్యవేణి బుధవారం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం, జిల్లా హెడ్స్ ప్రివెంటివ్, మెడిసిన్, మెడికల్ హెల్త్, లీగల్ మెట్రాలజీ, వినియోగదారుల సమాచార కేంద్రం, ఇతర వినియోగదారుల సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొంటారని ఆమె తెలిపారు.


టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ తదితరులను స్వాగతిస్తున్న బడేటి చంటి


పంగిడిగూడెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న రోషన్‌కుమార్

అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని

సాగనంపుదాం

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న టీడీపీ నేతలు

ఏలూరు టూటౌన్, మార్చి 13: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో రానున్న ఎన్నికల్లో వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపడం తథ్యమని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర బుధవారం 46వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కూలిపని చేస్తూ జీవించే సామాన్యులు అధికంగా ఉన్నారని, వారంతా టీడీపీకి కంచుకోటన్నారు. చాలా మంది సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికీ అందడం లేదన్నారు. అధికారుల చుట్టూ తిరిగిన కనీస స్పందన లేదన్నారు. వైసీపీతో విసుగు చెందిన ఎంతో మంది టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. మాజీ కార్పొరేటర్ ఎం.రాధాబాబు అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. పవర్‌పేట బడేటి కార్యాలయంలో బడేటి చంటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని చంటి అన్నారు. క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు ఎం.రాము, ఈదుపల్లి రామ్‌లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రతి ఒక్కరినీ పరిచయం చేసుకుంటూ ముందుకు సాగారు. పేరంపేట, పంగిడిగూడెం, వెంకట రామానుజపురం, కట్టవ పొదలవారిగుడెం, లక్కవరం గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, జనసేన మండల ఇన్‌చార్జ్ పులి శివ, గోలి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ కంకిపాటి కుమారి, సిలపరెడ్డి ఇంద్రాణి, పగడం సౌభాగ్యవతి, గోలి అనిల్, గొల్లమందల శ్రీను, దండే పద్మ, ఆరుగొల్లు గంగ, గుళ్లపూడి శ్రీదేవి, కొర్రారి ప్రసాద్, ముళ్లపూడి శ్రీను, లింగాల సత్యనారాయణ, ఘంటా రామారావు, బలుసు కిరణ్ కుమార్, అనపరెడ్డి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పంగిడిగూడెంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లింగాల సత్యనారాయణ, బేతాళ రమేష్, సాయిల సత్యనారాయణ, దాసరి శ్యామ్ చంద్ర శేషు, పులి శివ సమక్షంలో రాజకుమార్, సంపత్ కుమార్, అశోక్ కుమార్, లక్ష్మణ్, రాంబాబు, రాజశేఖర్, శ్రీనివాస్, అజయ్, దున్న శీను, మంగరాజు, పవన్, సోమరాజు, దుర్గాప్రసాద్, దుర్గా సాయి, గణేష్ తదితరులు టీడీపీలో చేరారు. రోషన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతుంటే ఒక్కచాన్స్ అని అధికారంలోకి వచ్చి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, అందుకే జనసేన, బీజేపీ కూడా కలసి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గోలి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ కంకిపటి కుమారి, చిలపరెడ్డి ఇంద్రాణి, గుళ్లపూడి శ్రీదేవి, చెరుకూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

ఏలూరు టూటౌన్: టీడీపీ, జనసేన పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించడంపై 23వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు లోకేశ్, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ సగర కులాన్ని బీసీ(డీ) నుంచి బీసీ(ఏ) కేటగిరికి మారుస్తామని చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీతో సగర కులస్థులంతా సంతోషంగా ఉన్నారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికులుగా ఉన్న సగర కులస్థులకు భవన నిర్మాణ కాంట్రాక్టులో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర సాధికార జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు, మీడియా కోఆర్డినేటర్ జి.గణేష్, ఎం.కృష్ణ, రెడ్డి జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

గుడి ముందు రహదారి నిర్మాణంపై ఫిర్యాదు

చింతలపూడి, మార్చి 13: పాతబస్టాండ్ సమీపంలోని మద్ది రావమ్మ సహిత జ్ఞాన సరస్వతి ఆలయం ముందు నగర పంచాయతీ అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు వీరంకి శ్రీనివాసరాయుడు తహసీల్దార్‌కు బుధవారం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మొహిద్దీన్‌చెరువు అలుగు నీరు పారే స్థలంలో 150 ఏళ్ల క్రితం ఆలయం నిర్మితమైందని, ఆలయంలో నిత్యం పూజలు జరిపే స్థలంలో రోడ్డు నిర్మాణంపై అడిగితే దౌర్జన్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఆలయ ప్రాంగణ స్థలం కాపాడాలని, భక్తుల మనోభావాలను గౌరవించి విచారణ చేసి రక్షణ కల్పించాలని కోరామని శ్రీనివాసరాయుడు తెలిపారు.

భూములు గిరిజనులు, పేదలకు ఇవ్వాలి

కుక్కునూరు, మార్చి 13: పోలవరం ప్రాజెక్టు భూపరిహారం పొందిన భూముల్లో అర్హులైన పేదలు, గిరిజనులు సాగు చేసుకునేందుకు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు కోరారు. ధవళేశ్వరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇలక్కియ, ఐటీడీఏ పీవో సూర్యతేజకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో పరిహారం పొందిన భూమిని ఇక్కడ ఉన్న రైతులకు కౌలుకు ఇస్తున్నారు. సన్నకారు, పేద రైతులు వేరే ఉపాధి లేక దిక్కు తోచని పరిస్థితుల్లో అంత కౌలు చెల్లించి వ్యవసాయం చేసి, వరదలు, వలన నష్టపోయి అప్పులు పాలవుతున్నారు. కొంత మంది అంత ధరలు పెట్టి వ్యవసాయం చెయ్యలేక కూలి పనికి వెళుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, నిర్వాసితులు కొండ్రు నరసింహారావు, సోడే సత్యవతి, సరియం హరనాథ్, మిడియం తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

చింతలపూడి, మార్చి 13: జాతీయ లోక్ అదాలత్ ఈనెల 16న జరుగుతుందని, రాజీపడతగ్గ కేసులు రాజీ చేసుకుని లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, గృహహింస, ప్రాంసరీ నోటు బకాయిలు, భూతగాదాలు, మనోవర్తి కేసులు, బ్యాంకు, టెలిఫోన్ బకాయిలు, ప్రిలిటిగేషన్ కేసులు, రాజీపడతగ్గ కేసులన్నీ రాజీ చేసుకోవాలన్నారు. న్యాయ సహాయం కావాలనే వారు కోర్టునాశ్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి బీమా మొత్తం అందజేత

ఏలూరు కలెక్టరేట్, మార్చి 13: పెదపాడు గ్రామానికి చెందిన తోటా కావ్యవలి భర్త తోటా అనుపమ్మకుమార్ విదేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. భారత రాయబార కార్యాలయం నుంచి ఎన్ఆర్ఐ పేమెంట్ (బీమా సొమ్ము) రూ.7,48,693 చెక్కును కావ్యవల్లికి కలెక్టరేట్‌లో జేసీ లావణ్యవేణి బుధవారం అందజేశారు.

17న ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశం

ఏలూరు రూరల్, మార్చి 13: హేలాపూరి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం ఈనెల 17న ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశానికి యూనియన్ సభ్యులు, ఎలక్ట్రికల్ వర్కర్స్ హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

లింగపాలెం, మార్చి 13: మండలంలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రామారావు బుధవారం తెలిపారు. ధర్మాజీగూడెంలో 2, రంగాపురంలో 1, సింగగూడెంలో 1, పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు కావాల్సిన ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీరు, కరెంటు ఇబ్బందిలేకుండా ముందుగానే ఆయాశాఖల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నామన్నారు.

ఎన్నికల బాండ్స్‌తో 'క్విడ్ ప్రో కో' : హరనాథ్

చాట్రాయి, మార్చి 13: ఎన్నికల బాండ్స్ 'క్విడ్ ప్రో కో' కు పాల్పడిన రాజకీయ నేతలను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల బాండ్స్ వివరాలు వెల్లడించటంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలయాపన వెనుక కేంద్రం హస్తం ఉందని ఆరోపించారు. ఎన్నికల ముందు బాండ్స్ వివరాలు ప్రజలకు తెలిస్తే ప్రతికూల ఫలితాలు వస్తాయేమోనని వివరాల వెల్లడి జాప్యానికి బీజేపీ విఫల యత్నం చేసిందన్నారు. క్విడ్ ప్రో కో లాంటి అవినీతికి పాల్పడిన నేతలను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా బహిష్కరించాలని హరనాథ్ డిమాండ్ చేశారు.

'పది' పరీక్షార్థులకు పూర్వ విద్యార్థుల బాసట


విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 13: స్థానిక ఏఆర్ డీజీకే మున్సిపల్ హైస్కూలు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో బోర్డులు, బాస్కెట్ బాల్ కోర్టును ఆధునికీకరణ చేశామని, వీటిని పరిరక్షించుకోవడం స్కూలు సిబ్బంది బాధ్యతగా తీసుకోవాలని కోరారు. స్కూలు పూర్వ విద్యార్థులు కె.రాజేష్, గంగాభవాని, నాగయ్య వివిధ అభివృద్ధి పనులను చేయించారని వివరించారు. సంఘ ఉపాధ్యక్షుడు బీజే.సతీష్, కె.రాజేష్, ఎం.శ్రీను, సాయిగోపాల్, ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి


మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళి

ఏలూరు కలెక్టరేట్, మార్చి 13: మొల్ల రామాయణంతో కీర్తిగడించిన మహనీయురాలు మొల్లమాంబ అని జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఆర్.నాగరాణి అన్నారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మొల్లమాంబ తొలి తెలుగు మహిళా కవయిత్రిగా పేరు గడించారని ఆమె రచించిన మొల్ల రామాయణం, ఇతర రామాయణాలతో పోలిస్తే చాలా సరళమైందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు వసతిగృహాల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలించిన సమగ్ర శిక్ష ఏపీసీ


ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న సోమశేఖర్

భీమడోలు, మార్చి 13: గుండుగొలను జడ్పీ హైస్కూలును సమగ్ర శిక్ష అడిషనల్ జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సోమశేఖర్ సందర్శించారు. హైస్కూలును పీఎం 3 స్కూలుగా ఎంపిక చేయబడి ఆట స్థలానికి రూ. లక్ష నిధులు విడుదల కావడంతో పనులు ప్రారంభించాలని పాఠశాల హెచ్ఎంను ఆదేశించారు. విద్యా కానుక వస్తువులు తప్పనిసరిగా ఉపయోగించాలని విద్యార్థులు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి ఆహార పదార్థాలను ఆయన రుచి చూశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామారావు, ఎంఈవో భాస్కర్ కుమార్, హెచ్ఎం విజయ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు


పౌష్టికాహారం పరిశీలిస్తున్న సీడీపీవో

భీమడోలు, మార్చి 13: పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 23 వరకూ జరుగుతాయని, అంగన్‌వాడీ కార్యకర్తలందరూ ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో పక్షోత్సవాలు నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి సూచించారు. గుండుగొలనులోని భీమడోలు ప్రాజెక్టు పరిధిలో గుండుగొలను సెక్టారులోని పలు అంగన్‌వాడీ సెంటర్లో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో పలు వంటకాలను వండి గర్భిణులు, బాలింతలకు, కిశోర బాలికలకు పంపిణీ చేశారు. ఈ ఆహారం ద్వారా కాల్షియం ఎక్కువగా అందుతుందని వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రక్తంలో చెక్కెర శాతం తగ్గుతుందని, మెరుగైన ఆరోగ్యాన్ని కల్పిస్తుందని వివరించారు. ఈ వంటకాలను అందరూ తీసుకోవాలని సీడీపీవో సూచించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజామణి, విజయ, అన్నమ్మ, పద్మ, ఈశ్వరి, సత్యవేణి, సుందరి, సుగుంధమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన పత్సమట్ల ధర్మరాజు


మనోహర్‌తో ధర్మరాజు, నాయకులు

ఉంగుటూరు, మార్చి 13: ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు బుధవారం తెనాలిలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. అభ్యర్థిత్వంపై సహకరించిన ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, గణపవరం మండలాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


సోనోవిజన్ ఏలూరు బ్రాంచ్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

ఏలూరులో సోనోవిజన్ బ్రాంచ్ ప్రారంభం

ఏలూరు టూటౌన్, మార్చి 13: ఏలూరు నగరంలో సోనోవిజన్ మూడో బ్రాంచ్‌ను బుధవారం ఎండీ భాస్కరమూర్తి బుధవారం ప్రారంభించారు. సత్రంపాడు అంబికాదేవి ఆలయ సమీపంలో షోరూం ఏర్పాటు చేశారు. భాస్కరమూర్తి మాట్లాడుతూ ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్, గృహోపకరణాలు నిత్యావసరాలుగా మారాయన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏలూరు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అత్యాధునిక షోరూం ప్రారంభించామన్నారు. ఇప్పటికే ఉన్న రెండు బ్రాంచ్‌లను ఆదరించినట్లుగానే సత్రంపాడు బ్రాంచ్ కూడా ఆదరించాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. తక్కువ ధరలు, ఈఎంఐల ద్వారా కూడా వస్తువులు అందిస్తామన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 8712635838/9ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షోరూంలో ఎల్‌జీ, శ్యామ్‌సాంగ్, సోని, లాయిడ్, ఓల్టాస్, హితాచి, కెరీర్, ప్యానసోనిక్, ఐఎంపీ, బోట్, యసర్, గోద్రేజ్, వాలపూల్, డైకిన్, ఐడీఎఫ్‌సీ కంపెనీలకు చెందిన బ్రాంచ్ మేనేజర్లు, సేల్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

ముగిసిన మేధా దక్షిణామూర్తి ఉత్సవాలు

దెందులూరు, మార్చి 13: చల్లచింతలపూడిలో మేధా దక్షిణామూర్తి ఉత్సవాలు ముగిశాయి. చల్లచింతలపూడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది భారీ అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. శివునికి పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. వందలాది మంది భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు,

దర్భగూడెంలో భూలక్ష్మి అమ్మవారికి పూజలు

జీలుగుమిల్లి, మార్చి 13: దర్భగూడెంలో భూలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ప్రారంభించారు. ఆలయం వద్ద మహిళలు, కుంకమ పూజలు నిర్వహించారు. గ్రామ ఇలవేల్పుకు మహిళలు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఐదు రోజల పాటు ప్రత్యేక పూజలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళల అభివృద్ధికి చేయూత

బుట్టాయగూడెం, మార్చి 13: మహిళాలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందడానికి చేయూత పథకం ఎంతగానో తోడ్పాటునిస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం చేయూత నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని 3,433 మందికి రూ.6.46 కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. జడ్పీటీసీ మొడియం రామతులసీ, తెల్లం రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ జి.మోహనరావు, కలగర నాని, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ కరాటం ఫణికుమార్, ఎంపీడీవో సుధా ప్రవీణ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏపీఎం పద్మావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

పెదపాడు, మార్చి 14: పెదపాడు మండలం సత్యవోలు-వడ్డిగూడెం మధ్య రూ.4.33 కోట్లతో 4.90 కిలోమీటర్ల బీటీ రహదారి, కల్వర్టుల నిర్మాణానికి జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ బుధవారం భూమిపూజ చేశారు. గోతులమయంగా మారిన రహదారి నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్, ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఆళ్ళ సతీష్, అక్కినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు రూరల్, మార్చి 13: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, శ్రీపర్రు, కలకుర్రు, పాలగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి బుధవార పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేశారు. శ్రీపర్రు కాజ్‌వేపై 20.72 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. శ్రీపర్రులో మహిళలకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేసి కలకుర్రులో రూ.10లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ షెడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు, జడ్పీటీసీ మండల సరస్వతి కొండలరావు, ఎంపీడీవో బండి ప్రణవి, తేరా ఆనంద్, మండల కొండలరావు, వడ్డీ కార్పొరేషన్ ఛైర్మన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులతో మిథున్‌రెడ్డి సమావేశం

జంగారెడ్డిగూడెం, మార్చి 13: మెట్ట ప్రాంతలో సీనియర్ నాయకుడైన జెట్టి గురునాథరావు వైసీపీలో చేరడం శుభపరిణామమని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. జంగారెడ్డిగూడెం దండమూడి కల్యాణ మండపంలో బుధవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. జెట్టి గురునాథరావు అనుచరులు పోలవరం, చింతలపూడి నియోజకవర్గంలోని పలువురు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, తెల్లం బాలరాజు, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ముప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సారా విక్రేతపై కేసు

టి.నరసాపురం, మార్చి 13: ఏపిగుంటలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు సిబ్బందితో బుధవారం దాడి చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతడిని చింతలపూడి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.


ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పిస్తున్న జేసీ లావణ్యవేణి


ఉంగుటూరులో శిక్షణ ఇస్తున్న ఆర్డీవో ఖాజా వలి


కొక్కిరపాడులో పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న తహసీల్దార్



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎన్నికల నిర్వహణలో జాగ్రత్తలు పాటించండి

అధికారులతో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

పెదపాడు, మార్చి 13: ఎన్నికల సిబ్బంది ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సూచించారు. దెందులూరు నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి సత్రంపాడులో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న దృష్ట్యా ఎన్నికల సిబ్బంది పోలింగ్, కౌంటింగ్ వంటి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి, శిక్షణ సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పొరపాట్లు జరిగితే చర్యలు తీవ్రస్థాయిలో ఉంటాయన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశిల్దార్లు జితేంద్ర, భవన్నారాయణ, సూర్యప్రభ, ఎంఈవో నరసింహమూర్తి, రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

ఉంగుటూరు: ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని, అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఖాజావలి అన్నారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయా రాజకీయ పార్టీల నాయకుల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చందక రాంబాబు, సూరిబాబు, ఉండవల్లి బాలానందం, పాతూరి విజయకుమార్, గుత్తికొండ వెంకట కృష్ణారావు, ప్రవీణ్ పటేల్, ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, గణపరం తహసీల్దార్లు కె.వెంకట శివయ్య, పోసిబాబు, వరహాలరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి ఖాజావలి ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు మండలాల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నారాయణపురం హైస్కూలులో శిక్షణ ఇచ్చారు. ఎన్నికల మెటీరియల్‌ను స్వీకరించడం, పోలింగ్ ముందు రోజు వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగం వివరించారు.

పోలింగ్ బూత్‌లలో పూర్తిస్థాయి సౌకర్యాలు

పెదపాడు: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండల పరిధిలో పోలింగ్ బూత్‌లుగా కేటాయించిన పాఠశాలలు, ఇతర భవనాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు, వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు భావన్నారాయణ తెలిపారు. మండల పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి విద్యుత్, దివ్యాంగులు ఉపయోగించేందుకు ర్యాంపు, ఇతర సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ

ఏలూరు రూరల్: రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపు లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు జరుగుతున్నాయని స్వీప్ నోడల్ అధికారి, డీపీవో తూతిక విశ్వనాథ్ అన్నారు. ఓటుహక్కు వినియోగంపై పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. అన్ని వర్గాల వారు ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో 79.77శాతం రాష్ట్రంలో పోలింగ్ నమోదైతే ఏలూరు జిల్లాలో 83.75శాతం నమోదైందన్నారు. అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో 68.10శాతం నమోదైందన్నారు. యువత ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కాకపోవడమే ప్రధాన కారణం అన్నారు. వచ్చే ఎన్నికల్లో 92శాతం పోలింగ్ కావడానికి కలెక్టర్, ఓటర్స్ టర్న్‌ఔట్ ప్రణాళికను ఆమోదించారని, దీనిలో భాగంగా ఓటర్లను చైతన్య పరుస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్డీ షరీఫ్, కె.లీలాధరణి, మాధవిలత తదితరులు పాల్గొన్నారు.


రహదారి వెంబడి చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

రహదారిని ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

కలిదిండి, మార్చి 13 : మట్టగుంట - పెదలంక ప్రధాన రహదారిని ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ అరవింద్, ఎంపీడీవో దినతేజ్ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం "చెరువును తలపిస్తున్న రహదారి" శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు అధికారులు మట్టగుంట - పెదలంక రహదారి వద్దకు వెళ్లి ధ్వంసమైన రహదారితోపాటు రహదారి మార్జిన్ ఆక్రమించి తవ్విన రహదారి వెంబడి చేపల చెరువులను పరిశీలించారు. రహదారికి 3 మీటర్ల దూరంలో చేపల, రొయ్యల చెరువులు తవ్వాల్సి ఉండగా, రహదారి మార్జిన్ సైతం ఆక్రమించి చెరువులు తవ్వటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై పడిన పెద్ద గోతులు పూడ్చాలన్నారు. రహదారి ధ్వంసమవ్వటానికి కారకులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ చెరువులకు మత్స్యశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవన్నారు. చేపల చెరువుల్లో ఊటనీరు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులను ఆదేశించారు. ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు జగన్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గుడిపాడులో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ముసునూరు, మార్చి 13: ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి చంద్రబాబు పాలనతోనే సాధ్యమని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి గంగారామ్ అన్నారు. బుధవారం గుడిపాడులో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను అందజేశారు. సంక్షేమం పేరుతో అన్నివర్గాల ప్రజలను మోసం చేసి, కోట్లాది రూపాయలు దండుకున్న జగన్‌రెడ్డికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని రఘుబాబు కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేయగల నాయకుడు చంద్రబాబు మాత్రమేనన్నారు. టీడీపీ నాయకులు మందలపు ధర్మరాజు, బోగోలు సత్యనారాయణ, కొల్లి కృష్ణయ్య, మందలపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు పట్టణంలో 'మన ఇంటికి మన సారథి'



నూజివీడు, మార్చి 13: టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో భవనాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని నూజివీడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మన ఇంటికి మన సారథి కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణంలోని రెండు, మూడు వార్డుల్లో ఆయన పర్యటించారు. స్థానికులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేతివృత్తుల వారికి కార్పొరేషన్ల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడంతో పాటు షాదీఖానాను రూ.25లక్షలతో అభివృద్ధి పర్చటం, ఈద్గా అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి కుమార్, కౌన్సిలర్ యార్లగడ్డ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు, పాదం సత్యనారాయణ, గొల్లు దుర్గాదేవి, వేమూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ముగ్గురు విద్యార్థినుల అదృశ్యం

ఆగిరిపల్లి, మార్చి 13: ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు బుధవారం పాఠశాలకు వెళ్ళి తిరిగిరాలేదు. స్కూల్ విడిచిన తరువాత ఇళ్ళకు రాలేదని వారి తల్లిదండ్రులు ఆగిరిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8.30 నిమిషాలకు స్కూల్‌కి వెళ్ళిన పిల్లలు తిరిగి రాకపోడంతో స్కూల్‌లో వాకబ్ చేస్తే పిల్లలు పాఠశాలకు రాలేదని తెలిసిందన్నారు. దీనిపై ఎస్ఐ సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796444 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఉద్యోగం ఆశ చూపి మోసం

ముసునూరు, మార్చి 13: ఉద్యోగం ఆశ చూపి రెండు లక్షల రూపాయలు తీసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ముసునూరు గ్రామానికి చెందిన దాసిరెడ్డి బాలస్వాతి 2020-22 సంవత్సరంలో బైపీసీ గ్రూప్ తీసుకుని ఇంటర్ పూర్తిచేసింది. యువతి తండ్రి దాసిరెడ్డి నాగు సైకిల్, బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన గద్దల ఆశీర్వాదం అనే వ్యక్తి, యువతి తండ్రితో పరిచయం పెంచుకున్నాడు. నీట్ పరీక్ష రాయకుండా, పంజాబ్ జీఎన్‌పి యూనివర్సిటీలో బీఎస్సీ ఎనస్థీషియా (మత్తు మందు) కోర్సుకు సంబంధించిన సీటుతోపాటు విదేశాల్లో ఉద్యోగం కూడా ఇప్పిస్తానని యువతికి, ఆమె తండ్రికి ఆశీర్వాదం ఆశచూపి 2023 డిసెంబర్ నెలలో రూ. 2 లక్షల నగదును తీసుకున్నాడు. నాటి నుంచి మాయమాటలు చెబుతూ కాలం వెళ్ళదీస్తున్నాడే తప్ప తీసుకున్న నగదు ఇవ్వకపోవడం లేదు. దీంతో యువతి బాలస్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్తకుండీలో నవజాత శిశువు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13: తాడేపల్లిగూడెంలో అమానుష ఘటన వెలుగు చూసింది. అప్పుడే పుట్టిన ఆడబిడ్డ మృతదేహం చెత్తకుండీలో బుధవారం ఉదయం దర్శనమిచ్చింది. పారిశుధ్య కార్మికులు చెత్త శుభ్రం చేసే క్రమంలో ఆ పసికందు మృతదేహం బయట పడింది. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు కూలీలకు గాయాలు

ముసునూరు, మార్చి 13: పొగాకు దుత్తల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ ముసునూరు మసీదు సమీపంలో ఉన్న మలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడి ఇద్దరు కూలీలకు గాయపడ్డారు. చాట్రాయి మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ బుధవారం ఉదయం దెందులూరు మండలం కొప్పాకలో పొగాకు దుత్తలు లోడ్ చేసుకుని తిరిగి మర్లపాలెం వెళుతోంది. ఈ క్రమంలో ముసునూరు మసీదు పక్కన మలుపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్ ఇంజన్‌పై ఉన్న ఆరుగురు కూలీల్లో ఇద్దరికి గాయపడగా వారికి ముసునూరు పీహెచ్‌సీలో చికిత్స అందించారు.

పట్టుబడిన లిక్కర్ ధ్వంసం



నూజివీడు టౌన్, మార్చి 13: నూజివీడు సెబ్ స్టేషన్‌ను ఏలూరు సెబ్ సూపరింటెండెంట్ కె.రామ కృష్ణ బుధవారం సందర్శించారు. సిబ్బందితో నేరాల ను తగ్గించే విధానాలపై చర్చించారు. అనంతరం గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు వివిధ కేసుల్లో పట్టుబడిన 383 లీటర్ల సారా, 581 మద్యం సీసాలను ఆయన ధ్వంసం చేశారు. నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుళాయికి సొమ్ము వసూళ్లు


నత్తగుల్లపాడులో విచారణ జరుపుతున్న ఈవోపీఆర్డీ రవిశంకరరావు

- కనెక్షన్‌కు రూ.1500 వసూలు చేస్తున్న వైసీపీ సర్పంచ్?
- వలంటీర్‌తో వసూళ్లు చేయించారని గ్రామస్థుల ఫిర్యాదు
- నత్తగుల్లపాడు ఈవోపీఆర్డీ విచారణ

కైకలూరు, మార్చి 13: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు నగదు వసూళ్ళపై వివాదం చోటు చేసుకుంది. బుధవారం కైకలూరు మండలం నత్తగుల్లపాడు గ్రామంలో కుళాయిలకు డబ్బులు వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు ఈవోపీ ఆర్డీ ఆర్. రవిశంకరరావు విచారణ చేపట్టారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.10.50 లక్షలు నిధులు మంజూరయ్యాయని కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్నాడు. నూతనంగా కుళాయి మంజూరు కోసం రూ.1500 గ్రామ వైసీపీ సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు, గ్రామానికి చెందిన వలంటీర్ ఘంటసాల శ్రీరామకృష్ణ ద్వారా 48 మంది నుంచి వసూలు చేస్తున్నారని, జలజీవన్ మిషన్ ద్వారా ఉచితంగా కుళాయిలు అందించవలసి ఉండగా నగదు వసూలు చేయడంతో గ్రామ ఉప సర్పంచ్ నబిగారి ఏడుకొండలు, వార్డు సభ్యుడు ముంగర థామస్, గ్రామస్థులు నబిగారి కృష్ణానంద్, ఘంటసాల చందు, నబిగారి భీమరాజుతో పాటు మరికొంతమంది అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొత్త కనెక్షన్ వేయించుకునే వారికి రూ.1500, పాత కనెక్షన్ నూతన పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇచ్చేందుకు రూ.1200 ఖచ్చితంగా కట్టాలని వలంటీర్ పదేపదే ప్రజలపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు గ్రామాల్లో కట్టుబాట్ల మధ్య ప్రజలంతా ఒకే మాటపై ఉంటారని గ్రామ సమావేశాన్ని ఏర్పాటు చేయకుండా సర్పంచ్ ఏకపక్షంగా నిర్ణయాన్ని తీసుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అనేకమంది పేదవారు ఉన్నారని రోజూ కూలి పనికి వెళితే గాని ఇల్లు గడవని పరిస్థితిలో వారిపై ఒత్తిడి చేసి డబ్బులు కట్టాలని లేకుంటే మీకు కుళాయి కనెక్షన్ ఉండదని బెదిరిస్తున్నారన్నారు. దీంతో కొద్దిసేపు గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీనిపై ఈవోపీఆర్డీ రవిశంకరరావు స్పందిస్తూ జలజీవన్ మిషన్‌లో ఉచితంగా కుళాయిలు అందించవలసి ఉందని, నూతన పైప్‌లైన్ ద్వారా పాత కనెక్షన్ ఉన్న లబ్దిదారుడు సొంతంగా కుళాయిని మార్పు చేసుకోవాలని కాంట్రాక్టర్‌కు ఎలాంటి రుసుము చెల్లించక్కర్లేదని సూచించారు. రూ.1500 చొప్పున వసూలు చేసిన నగదును ఎవరివి వారికి ఇచ్చేయాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.


సారథికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకురాలు వరలక్ష్మి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

అధికారంలోకి రాగానే చింతలపూడి, తమ్మిలేరు పూర్తి

చాట్రాయి, మార్చి 13: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే చింతలపూడి ఎత్తిపోతల పథకం, తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు, చీపురుగూడెంలో బుధవారం రాత్రి టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశం టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ముసుగులో ఒకచేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కున్నదన్నారు. భావితరాల బంగారు భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఐదేళ్లలో రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి వెళ్ళిందని అభివృద్ధి ఎక్కడా కానరావటంలేదని చింతలపూడి, పోలవరం లాంటి ఎన్నో ప్రాజెక్టుల పనులు అటకెక్కాయని విమర్శించారు. అంతకు ముందు గ్రామ పొలిమేర వద్ద పార్థసారథికి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, అక్కినేని చందు, బొట్టు లక్ష్మణరావు, రామచంద్రరావు, మందలపు జగదీష్, చీకటి చెన్నారావు, అత్తులూరి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి లక్ష్మణరావు, దుర్గారావు అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్ : కామినేని

కలిదిండి, మార్చి 13 : పల్లెలకు పట్టుగొమ్మలైన పంచాయతీలను నిర్వీర్యం చేసిన సీఎం జగన్‌ను సాగనంపాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం కొండంగిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులను పక్కదోవ పట్టించడంతో గ్రామాల్లో అభివృద్ధి లేదన్నారు. లంక గ్రామాల్లో రహదారులు గోతులు పడి అధ్వానంగా ఉన్నా పట్టించుకోకపోవటం దారుణమన్నారు. సాగు, తాగునీటి కొరతతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతూ దాడులు చేస్తూ అరాచక పాలన చేస్తున్నారన్నారు. ఆక్వా రంగం సంక్షోభంలో ఉంటే మేతల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచి వారి ఆక్వా రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమైపోయి గ్రామీణ ప్రజలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్యాయమైపోతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, తాడినాడ బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, జనసేన నాయకుడు బాబి, బీజేపీ నాయకుడు కోకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

17న టీడీపీ సభను విజయవంతం చేయాలి

ముదినేపల్లి రూరల్, మార్చి 13: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ఈ నెల 17న జరిగే టీడీపీ - జనసేన, బీజేపీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన ఈ నెల 17న ప్రధాన కార్యదర్శి పోకల దేవేంద్ర గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ కృషి కారణంగానే మూడు పార్టీల పొత్తు జరిగిందని ఇది రాష్ట్రానికి శుభ పరిణామం అన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

చంద్రబాబు సమావేశానికి స్థల పరిశీలన



కైకలూరు, మార్చి 13: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కైకలూరులో త్వరలో నిర్వహించే సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఆధ్వర్యంలో స్థలపరిశీలన చేశారు. బుధవారం కైకలూరు మండలం ఆటపాక, రాచపట్నం, మండవల్లి మండలం పెరికేగూడెంలో హెలిప్యాడ్, సభా ప్రాంగణాన్ని నిర్వహించేందుకు స్థలాలను పరిశీలించారు. త్వరలో ఈ సమావేశం జరగనున్నందున ముందుగానే స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మండల పార్టీల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ రబీబా, దాకరం సర్పంచ్ జాన్సి రాజా, టీడీపీ నాయకులు చలసాని జగన్మోహనరావు, కొడాలి వినోద్, ఎండీ జానీ, సుధా, పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన పెద్దింటమ్మ ఆలయం

కైకలూరు, మార్చి 13: కొల్లేటికోట పెద్దింటమ్మ జాతర ఉత్సవాల 3వ రోజు అమ్మవారు భక్తుల నుంచి విశేషపూజలు అందుకున్నారు. బుధవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మ వారికి ద్వితీయవరణ పూజ, పుష్పాలంకరణ, కలశపూజ, ఖడ్గపూజ, దూపసేవ, నీరాజనం, బాలభోగం, మంత్రపుష్పం, పంచహారతులు ఇచ్చి పూజలు చేశారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదం భైరవపట్నం గ్రామానికి చెందిన బుద్దరాజు సుబ్రహ్మణ్యంరాజు, వాసవి శైలజదుర్గాంబిక దంపతులు అందజేశారు. సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా గుడివాడకు చెందిన కళాకారుల త్రిరత్నాలు నాటక ప్రదర్శన, కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ అధికారి కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి రాట పూజ

ముదినేపల్లి రూరల్, మార్చి 13: మండలంలోని సింగరాయపాలెంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవానికి బుధవారం రాటపూజ నిర్వహించారు. ఈ నెల 26 వరకు జరిగే కల్యాణోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి రూరల్, మార్చి 13: మండలంలోని సింగరాయపాలెం, చెవురుపాలెం సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ డివిజనల్ దేవదాయశాఖ తనిఖీ అధికారి పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని వివరించారు.

చిరుధాన్యాలతో రక్తహీనత దూరం



కైకలూరు, మార్చి 13: చిరుధాన్యాల వినియోగం గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు సాధ్యపడుతుందని ఇన్‌చార్జి సీడీపీవో లావణ్య అన్నారు. బుధవారం కైకలూరులోని 2వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల్లో అనేక పోషకాలుంటాయని అవి తల్లీబిడ్డలను ఆరోగ్యంగా ఉంచుతాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు గంగాజలం, లీలావతి, మధుర, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


గుడిపాడులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సంక్షేమ పథకాల్లో దోపిడీ ఇలా..

- పథకాల లబ్ధి కరపత్రాలు.. ఇచ్చిన సొమ్ముకు తేడా చూపిన టీడీపీ

ముసునూరు, మార్చి 13: నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాల్లో వైసీపీ ప్రభుత్వం దోపిడీకి తెరలేపిందని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి గంగారామ్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు విమర్శించారు. గురువారం గుడిపాడులో బాధిత కుటుంబంతో కలసి వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వివిధ పథకాల రూపంలో చేకూరే లబ్ధిపై ఇటీవల వలంటీర్‌లు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారన్నారు. గుడిపాడుకు చెందిన ఉండవల్లి నాగమణి ముగ్గురు పిల్లలు ఇంజినీరింగ్ చదువుతున్నారు. వీరికి విద్యాదీవెన కింద రూ. 1 లక్ష 75వేలు ఇచ్చినట్టు కరపత్రంలో ముద్రించారని అయితే వీరికి రూ.40 వేలు మాత్రమే వచ్చిందన్నారు. అలాగే వసతి దీవెన పథకంలో లక్ష రూపాయలు ఇచ్చినట్లుగా ఉంటే రెండేళ్ళలో రూ.14 వేలు మాత్రమే అందాయన్నారు. ఆసరా పథకంలో డ్వాక్రా రుణమాఫీకి నాలుగు విడతల్లో రూ.64,700లు చెల్లించినట్లు కరపత్రంలో వేయగా రూ.48 వేలు మాత్రమే జమయ్యాయన్నారు. కరపత్రంలో వీరికి అందిన లబ్ధి రూ.3,39,700 అని చూపారని, అయితే రూ.1,02,000 మాత్రమే నాగమణి కుటుంబానికి వచ్చాయని, మిగిలిన రూ. 2,37,700ల నగదు ఎవరి జేబులోకి వెళ్ళాయో జగన్‌రెడ్డి చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విధంగా సంక్షేమ పథకాల్లో జగన్‌రెడ్డి లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డాడన్నారు. సంక్షేమం పేరుతో అన్నివర్గాల ప్రజలను మోసం చేసి, భారీ స్కాంకు తెరతీసిన జగన్‌రెడ్డి బాగోతాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బట్టబయలు చేసి, తిన్నది కక్కించేలా చంద్రబాబు చట్టపరంగా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

కైకలూరు, మార్చి 13: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చేపట్ట వల సిన విధి విధానా లను అధికారులు పూర్తి స్థాయిలో తెలు సుకో వాలని ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత అన్నారు. బుధవారం కైకలూరు ఉర్దూ పాఠశాలలో నియోజకవర్గంలోని పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. అధికా రులకు మాక్ పోలింగ్ ఎలా చేయాలి అనే అంశంపై వివరించి ఈవీఎంల పనితీరును వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఎన్నికల విధుల పట్ల అధికారు లు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎంలను ఎలా ఉపయో గించాలో నేరుగా పీవో, ఏపీవోలకు వివరించారు. ఈ శిక్షణా తర గతుల్లో ఆర్వో కె భాస్కర్, నాలుగు మండలాల తహసీల్దార్లు కె. పోతురాజు, డి. వంశీ, సుబాని, కుమారి ఎన్నికల డీటీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు


టెన్త్ పరీక్షా కేంద్రమైన ముదినేపల్లి హైస్కూల్

ముదినేపల్లి, మార్చి 13: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ముదినేపల్లి మండలంలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 8 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, 8 ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 686 మంది విద్యార్థులు రాయనున్నారు. మండలంలోని ముదినేపల్లి, పెదగొన్నూరు హైస్కూళ్లు, ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సహాయమాత హైస్కూల్‌లో ఏర్పాట్లు చేస్తున్న ట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. మండలంలో బాలురు 372 మంది, బాలికలు 314 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తామని ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు.


రిలే దీక్షల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు, కాలనీ వాసులు

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని దీక్షలు

ముదినేపల్లి, మార్చి 13 : ముదినేపల్లి మండలం పెయ్యేరు పంచాయతీ ఏరియాలోని వైఎస్ఆర్ కాలనీలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీ వాసులు బుధవారం రిలే దీక్షలు ప్రారంభించారు. కాలనీ వద్ద బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో రెడ్డి నాగలక్ష్మి, దాసరి ప్రకాష్, బండి ఈశ్వరమ్మతోపాటు కాలనీ వాసులు తొలి రోజు దీక్షల్లో పాల్గొని పక్కా డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలనీలో గత 12 ఏళ్లుగా సుమారు 150 కుటుంబాలు మురుగునీటి మధ్య జీవనం సాగిస్తున్నాయని, ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు బయటకు పోయే మార్గం లేదని, దీక్షల్లో పాల్గొన్న మహిళలు తెలిపారు. వర్షాకాలం కాలనీలోని రోడ్లపై నిలిచిన నీరు బయటకు వెళ్లేందుకు వారం రోజుల సమయం పడుతోందని, దీంతో దోమలు విజృంభించడంతో పాటు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి అధికారులకు చెబుతున్నా పట్టించుకోవటం లేదని బీజేపీ నాయకుడు ఫణీంద్ర తెలిపారు. డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపే వరకు దీక్షలు కొనసాగుతాయని కాలనీ వాసులతో పాటు బీజేపీ నాయకులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు

చాట్రాయి, మార్చి 13: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తే సమాజంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని ఐద్వా నాయకులు అక్కిరాజు శ్యామల, మహిళా పోలీస్ ఎల్. ప్రసన్న అన్నారు. మండలంలోని పోలవరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళా సంఘం నాయకురాలు లింగోజు సరిత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ అమెరికాలో మహిళలు జెట్కిన్ నాయకత్వంలో పనిగంటల విధానం కోసం ఐక్యంగా పోరాడి ఎన్నో హక్కుల సాధించుకున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందడుగు వేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మహిళలు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై నోటీసు

ముసునూరు, మార్చి 13: రమణక్కపేట పంచాయతీకి చెందిన కోమటికుంట చెరువు ఆక్రమణపై ఎంపీడీవో సీహెచ్.పద్మావతీదేవి ఆదేశాల మేరకు, బుధవారం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. స్థానికుడు నామాల లక్ష్మయ్య ఈ చెరువులో సుమారు 20 సెంట్ల భూమిని మేరకచేసి అక్రమంగా షెడ్ నిర్మిస్తున్నాడని స్థానికులు స్పందనలో ఇచ్చిన అర్జీపై అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీకి చెందిన కోమటికుంట చెరువులో అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, మూడు రోజుల్లో తొలగించకుంటే కట్టడాన్ని తొలగిస్తామని, అందుకు అయిన ఖర్చును సైతం ఆక్రమణ దారుడే చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరికలతో కూడిన నోటీసును ఆక్రమణ దారుడు లక్ష్మయ్యకు కార్యదర్శి ప్రసాద్ అందజేసి, మరో నోటీసును గోడపై అంటించారు.

ఎన్నికల బాండ్స్‌తో 'క్విడ్ ప్రో కో' : హరనాథ్

చాట్రాయి, మార్చి 13: ఎన్నికల బాండ్స్ 'క్విడ్ ప్రో కో' కు పాల్పడిన రాజకీయ నేతలను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల బాండ్స్ వివరాలు వెల్లడించటంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలయాపన వెనుక కేంద్రం హస్తం ఉందని ఆరోపించారు. ఎన్నికల ముందు బాండ్స్ వివరాలు ప్రజలకు తెలిస్తే ప్రతికూల ఫలితాలు వస్తాయేమోనని వివరాల వెల్లడి జాప్యానికి బీజేపీ విఫలయత్నం చేసిందన్నారు. క్విడ్ ప్రో కో లాంటి అవినీతికి పాల్పడిన నేతలను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా బహిష్కరించాలని హరనాథ్ డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు



నూజివీడు టౌన్, మార్చి 13: 10వ తరగతి ప్రశ్నపత్రాలను నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ నెల 18 నుంచి 30 వరకు టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో నూజివీడు పట్టణ, మండల ప్రాంతాలకు సంబంధించి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాల సెట్ -2ను నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ముదినేపల్లి, మార్చి 13 : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 202 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఇదిలా ఉండగా పెదవేగి ప్రభుత్వ గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జై రాజు ఆధ్వర్యంలో స్క్వాడ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసింది.



ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

చాట్రాయి, మార్చి 13: తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్లపాలెంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని బుధవారం మాజీ ఎంపీటీసీ వెల్ది సూర్యనారాయణ ప్రారంభించారు. ఫౌండేషన్ సభ్యుడు ఎన్. అజయ్ మాట్లాడుతూ ఈ శిక్షణా కేంద్రంలో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలల్లో మహిళలకు ఉచిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫౌండేషన్ మండల ప్రతినిధి కేశవ నరసింహారావు, గ్రామ ప్రముఖులు మరీదు శోభనాద్రి, నాగ వెంకట సుబ్బారావు, మల్లికార్జున గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్యాంకు భవనం ప్రారంభం



నూజివీడు టౌన్, మార్చి 13:నూజివీడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం బ్యాంకు నూతన భవనాన్ని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ తాతినేని పద్మావతితో కలిసి ప్రారంభించారు. నూజివీడు మున్సిపల్ ఛైర్మన్ రామిశెట్టి త్రివేణీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఈదులగూడెంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ఆగిరిపల్లి, మార్చి 13: ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామంలో రూ. 62 లక్షలతో మంజూరైన జలజీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన, రూ.32లక్షలతో నిర్మించిన నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. నెక్కలం గొల్లగూడెం, సింహాద్రి అప్పారావుపేటలో సీసీ రోడ్లు ప్రారంభించారు.